# అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్
- ఎర్రగడ్డలో ఉదయం రోడ్‌షో.. సాయంత్రం ప్రచారం

ఎర్రగడ్డ, అక్టోబర్ 29: ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చని సీఎం కేసీఆర్ చేతల్లో నిరూపించారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపినాథ్ అన్నారు. ఆదివారం ఆయన ఎర్రగడ్డ డివిజన్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఉదయం రోడ్‌షో.. సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించగా అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పలు చోట్ల మహిళలు మంగళ హారతులతో గోపినాథ్‌కు స్వాగతం పలికారు. ఎర్రగడ్డలోని వీధులన్నీ గులాబీ మయంగా మారడమే కాకుండా దాదాపు అన్ని ఇండ్లపై పార్టీ జెండాలు రెపరెపలాడాయి. ఉదయం డివిజన్‌లోని జేకే పాయింట్ వీధి, సాయి కాంప్లెక్స్, ఛత్రపతి శివాజీనగర్, ఆనంద్‌నగర్, ప్రేమ్‌నగర్, నందానగర్, వెంకటేశ్వర కాలనీ, బి.శంకర్‌లాల్‌నగర్‌ల మీదుగా జనప్రియ సమీపంలోని మైదానం వరకు రోడ్‌షో కొనసాగింది. సాయంత్రం ఒవైసీ గ్రౌండ్, యూపీ గల్లీ, సుల్తాన్‌నగర్, సౌత్ శంకర్‌లాల్‌నగర్, నేతాజీనగర్, నటరాజ్‌నగర్ ఫాతిమానగర్, రాజీవ్‌నగర్‌లలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపినాథ్ స్థానికులకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గురించి వివరించారు.

ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ ..అభివృద్ధి ప్రదాత హ్యాట్రిక్ విజయాన్ని దుష్టశక్తులు అడ్డుకోలేవని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుల ద్వారా తెలంగాణను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. 24 గంటలు నిరంతర విద్యుత్‌తో పాటు తాగునీటి గోసను దూరం చేసిన అపర భగీరథుడు మన ముఖ్యమంత్రి అని పేర్కొన్నారు. మైనార్టీలు, మహిళలు, బీసీలు, దళితుల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు పర్చుతున్న బీఆర్ఎస్‌కు పట్టం కట్టటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని.. మాటలతో మభ్య పెడుతూ పబ్బం గడుపుకోవాలనుకున్న పార్టీలకు తగిన విధంగా బుద్ధి చెబుతారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా.. అన్నగా సీఎం కేసీఆర్ ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నుంచి మూడోసారి బరిలో ఉన్న తనను అత్య ధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభు త్వానికి ముందు ఎర్రగడ్డ పరిస్థితి అధ్వానంగా ఉండేదని.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని సమస్యలను దూరం చేయ డం జరిగిందని వివరించారు. డివిజన్ అధ్యక్షుడు సంజీవ, ప్రధాన కార్యదర్శి షరీఫ్‌ఖురేషీ, పల్లవియాదవ్, గంట మల్లేశ్, మహ్మద్‌సర్దార్, మహ్మద్‌అహ్మద్, మహ్మద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.


ఎర్రగడ్డలో నిర్వహించిన ప్రచారంలో స్థానికులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్


ప్రచారంలో భాగంగా మ్యానిఫెస్టో అంశాలున్న కరపత్రాలను మహిళకు అందజేస్తున్న మాగంటి


ఎమ్మెల్యే గోపినాథ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, ఎంఐఎం యువకులు

## బీఆర్ఎస్‌లోకి చేరికలు..

### గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గోపినాథ్

ఎర్రగడ్డ, అక్టోబర్ 29: ఎర్రగడ్డకు చెందిన పలువురు కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలనువీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన సుమారు 100 మందికి ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎర్రగడ్డ డివిజన్ సుల్తాన్‌నగర్‌కు చెందిన జావిద్, నజీర్ మిత్రబృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోపినాథ్ మాట్లాడుతూ.. మైనార్టీలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న సీఎం కేసీఆర్ ఈ ఎన్నికలకుగాను ప్రకటించిన మ్యానిఫెస్టోకు అన్ని వర్గాల ప్రజలు సలాం కొడుతున్నారని పేర్కొన్నారు. సాధ్యాసాధ్యాలను అంచనా వేసి రూపొందించిన ఈ మ్యానిఫెస్టో ప్రజల్లోకి వెళ్లి విశేష ఆదరణ పొందిందని అన్నారు. పార్టీలో చేరిన వారిలో షేక్ మసూద్, ఎండీ మాజిద్, ఎండీ ఎజాజ్, ఎండీ అజర్, సయ్యద్ ఇర్ఫాన్, సయ్యద్‌ఉమర్ తదతరులున్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంజీవ, ప్రధాన కార్యదర్శి షరీఫ్‌ఖురేషీ, పల్లవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన పారిశుధ్య నిర్వహణకు చర్యలు..

### యూసుఫ్‌గూడ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ రవి


యూసుఫ్‌గూడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంఓహెచ్ డాక్టర్ రవి

జూబ్లీహిల్స్,అక్టోబర్29: యూసుఫ్‌గూడ సర్కి ల్ ఏఎంఓహెచ్‌గా డాక్టర్ రవి బాధ్యతలు చేపట్టా రు. ఇప్పటికే ఇక్కడ ఏఎంఓహెచ్‌గా పనిచేస్తున్న డాక్టర్ ప్రవీణ ఖైరతాబాద్ 17 వ సర్కిల్‌కు బదిలీ కాగా బండ్లగూడ జాగీర్ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.ఎస్.రవి యూసుఫ్‌గూడ 19 వ సర్కిల్‌కు బదిలీపై వచ్చారు. అనంతరం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంఓహెచ్ డాక్టర్ రవి మాట్లాడుతూ.. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా మెరుగైన పారిశుధ్య నిర్వహణ చేపట్టనున్నట్లు తెలిపారు. పిన్ పాయింట్ ప్రోగ్రాంతో పకడ్బందీగా పారిశుధ్య నిర్వహణ చేపట్టనున్నట్లు తెలిపారు. స్వచ్ఛ ఆటోలు విధిగా ప్రతి ఇంటికి వెళ్ళి చెత్త సేకరించేలా చర్యలు తీసు కోవాలన్నారు. స్వచ్ఛ ఆటోల భాగస్వామ్యంతో రోడ్ల వెంట శుభ్రం చేస్తున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు.

## ఫిలింనగర్‌లో కార్డన్ సెర్చ్

బంజారాహిల్స్,అక్టోబర్ 29: అసాంఘిక శక్తుల ఆటకట్టించడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టడం కోసం ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీజేఆర్‌నగర్‌లో ఆదివారం సాయంత్రం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవీస్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పోలీసులు బస్తీని చుట్టుముట్టి అన్ని ఇండ్లను జల్లెడ పట్టారు. సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్ చేశారు. జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

## హలో మాల-చలో బస్తీబాట పాదయాత్ర

బంజారాహిల్స్,అక్టోబర్ 29 : తెలంగాణ రాష్ట్రంలో మాలలకు సరైన ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు వారి సమస్యలు పరిష్కరించాలంటూ 'తెలంగాణ రాష్ట్ర మాల పోరాట సమితి' ఆధ్వర్యంలో చేపట్టిన 'హలో మాల-చలో బస్తీబాట' కార్యక్రమాన్ని ఆదివారం ఫిలింనగర్‌లో చైర్మన్ చెన్నయ్య ప్రారంభించారు. అనంతరం బస్తీల్లో పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్ర మాల పోరాట సమితి వైస్ చైర్మన్లు మన్నె శ్రీధర్ రావు, కరణం కిషన్, బలవంత్‌రావు పాల్గొన్నారు.

## ఫిలింనగర్‌లో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

బంజారాహిల్స్,అక్టోబర్ 29: జాతీయ ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా జాతీయ భారతీయ వైద్య పరంపర సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఫిలింనగర్‌లోని జ్ఞానీ జైల్‌సింగ్‌నగర్ బస్తీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో భాగ ంగా దీర్ఘ కాలిక జబ్బులు, వాటి పరిష్కారాలు, ఆయుర్వేద విధానంలో వ్యా ధుల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ హైదరాబాద్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డా. జీపీ.ప్రసాద్, రీసెర్చ్ ఆఫీసర్ డా.క్రిస్ ఆంటోని, డా.హేమరాజ్, డా.కార్తీకేశ్వరి, శ్రీనివాస్‌రావు, రవిబాబు పాల్గొన్నా రు.నేషనల్ యునానీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఎర్రగడ్డ వారి సహకారంతో మొక్కలు అందజేశారు. కార్యక్రమ నిర్వహణకు స్థానికులు సాయికిరణ్, రవి, రాంబాబు సహకారం అందించారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు..

### జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవి

### స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన ఓటింగ్ యంత్రాలు

జూబ్లీహిల్స్, అక్టోబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవి పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు 411 బ్యాలెట్ యూనిట్లు, 460 వీవీ ప్యాట్‌లు, మరో 411 కంట్రోల్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం డిప్యూటీ కలెక్టర్ శివ కుమార్‌తో కలిసి యూసుఫ్‌గూడ కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూమ్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఓటింగ్ యంత్రాలను భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆర్వో రవి మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమంతో పాటు మొదటి విడత ప్రిసైడింగ్ ఆఫీసర్స్ శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిచేసినట్లు తెలిపారు. ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టడంతో పాటు వందశాతం ఓటింగ్ నమోదయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. పోలింగ్ స్లిప్‌ల పంపిణీతో పాటు సీనియర్ సిటిజన్స్‌లో 80 ఏండ్లు పైబడిన ఓటర్లకు, పర్సన్ విత్ డిజెబుల్టీ (పీడబ్ల్యూడీ) ఓటర్లకు ఇంటివద్ద నుంచి ఓటు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్‌లపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులకు, దివ్యాంగులకు పోలింగ్ బూత్‌లలో ర్యాంప్‌లు, వీల్ చైర్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరో రెండు రోజులు ఓటరు నమోదుకు అవకాశం ఉన్నందున అక్టోబర్ 31లోపు 18 ఏండ్లు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవా లన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఓటింగ్ యంత్రాలను నామినేషన్ల ప్రక్రియ అనంతరం అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆయా పోలింగ్ స్టేషన్లకు తరలించనున్నట్లు తెలిపారు.


యూసుఫ్‌గూడ కేవీబీఆర్ స్టేడియం స్ట్రాంగ్‌రూమ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవి, డిప్యూటీ కలెక్టర్ శివ కుమార్